సాక్షి
వైఎస్సార్ జిల్లా
ఆదివారం । 31 । మార్చి । 2024



వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి

కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని మాజీ కౌన్సిలర్ తమ్మినేని లక్ష్మీదేవి అన్నారు. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
కడప	: 6.30	4.55
పులివెందుల	: 6.33	4.50
ప్రొద్దుటూరు	: 6.32	4.59

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.4/24.8

జిల్లాలో శనివారం 24.8 – 42.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఆస్తి పన్ను ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మినహాయింపు

కడప కార్పొరేషన్: రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలలో ఆస్తి పన్నులు, ఖాళీజాగాల పన్నులకు సంబంధించి ఆర్థిక సంవత్సరం చివరి వరకు ఉన్న బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీని మాఫీ చేసినట్లు కడప నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లించాల్సిన చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకేసారి మార్చి 31వ తేదీలోపు చెల్లిస్తే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. ప్రజల సౌకర్యార్థం 31వ తేదీ ఆదివారం అయినప్పటికీ రాత్రి 12 గంటల వరకు కడప నగరపాలక సంస్థలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

నేడు క్రీస్తు పునరుత్థాన మహోత్సవం



విద్యుత్ దీపాలంకరణలో కడపలోని ఆరోగ్యమాత చర్చి

కడప కల్చరల్: గుడ్‌ఫ్రైడే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఈస్టర్ సండేను క్రైస్తవ లోకం నిర్వహించనుంది. తపస్కాలాన్ని పురస్కరించుకొని 40 రోజులపాటు భక్తి శ్రద్ధలతో ఉపవాసాన్ని ఆచరించారు. ఎక్కువ సమయాన్ని ప్రార్థనతో గడిపారు. ఉన్న దానిలో దాన ధర్మాలు చేస్తూ దీక్షలో ఉన్నారు. శుభ శుక్రవారం తర్వాత వచ్చే పవిత్ర ఆదివారం నాడు, క్రీస్తు ప్రభువు మరణాన్ని జయించి మృత్యుంజయుడై సజీవునిగా లేచిన సందర్భంలో క్రైస్తవ లోకమంతా అమిత ఆనందముతో సంతోషంతో క్రీస్తు పునరుత్థాన పండుగను నిర్వహించుకుంటున్నారు.ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

పుష్పగిరి సందర్శన



లక్ష్మీచెన్నకేశవస్వామిని దర్శించుకుంటున్న హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ సీతారామమూర్తి శర్మ

వల్లూరు: పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం. సీతారామమూర్తి శర్మ శనివారం సందర్శించారు. కొండపైన ఉన్న శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చేసిన ఆయనకు అర్చకులు సుమంత్ దీక్షితులు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. శ్రీ చెన్న కేశవ స్వామిని, శ్రీ రాజ్య లక్ష్మీ అమ్మవారిని, సంతాన మల్లేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ శిల్ప సంపదను పరిశీలించారు. పవిత్ర పెన్నా నదిని సందర్శించారు. అర్చకులు ఆయనకు క్షేత్ర విశిష్టత, చరిత్రను గురించి, పంచ నదీ సంగమమైన పెన్నా నదిని గురించి వివరించారు. అనంతరం ఆలయ మండపంలో ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ అమర్‌నాథ్, పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుతల సంచారంతో బెంబేలు



హైనా పాద ముద్రలు

పెద్దతిప్పసముద్రం: అన్నమయ్య జిల్లా బోడిగుట్ట సమీపంలో నాలుగు రోజుల నుంచి రెండు చిరుత పులుల సంచరిస్తున్నాయని వార్త దావానంలా వ్యాపించింది. దీంతో రైతులు, పశు కాపరులు హడలెత్తిపోతున్నారు. పొలాల్లో పాద ముద్రలు చూసిన రైతులు అవి పులులవే అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పశు కాపరులైతే మూగ జీవాలను మేత కోసం తోలుకెళ్లేందుకు జంకుతున్నారు. తాజాగా శనివారం బోడిగుట్ట వద్ద బూరగ రవనప్ప అనే రైతు మామిడి తోటకు నీళ్లు పారిస్తుండగా చెట్టుపై నుంచి ఒక్కసారిగా దూకిన చిరుతను చూసి ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని పరుగులు తీశానని చెప్పడంతో ప్రజలు మరింత భయపడుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఫొటోలు చూసిన అటవీ శాఖ అధికారులు ఈ పాద ముద్రలు చిరుత పులులవి కావు.. హైనా పాద ముద్రలు అని నిర్ధారించారు. కాగా 2010 సెప్టెంబర్ 8న కూడా హైనా రెండు మండలాల్లో బీభత్సం సృష్టించింది. సుమారు 10 మందికి పైగా అమాయక ప్రజలను దాడి చేసి తీవ్రంగా గాయపరచగా వీరిలో ఇద్దరు మృతి చెందిన సంఘటన పాఠకులకు విదితమే. గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా అటవీ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆయకట్టు.. ఆయువు పట్టు

- సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- శరవేగంగా పనులు
- సాగు, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు
- టీడీపీ హయాంలో ప్రాజెక్టు పనులను విస్మరించిన వైనం



గండికోట ప్రాజెక్టు

కడప సిటీ : రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంతేకాకుండా ప్రాజెక్టు అభివృద్ధి పనులకు నిధులను కేటాయించింది. పనులు వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టు బాగా పెరిగింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అంటే 2019 వరకు గండికోట అనుబంధ ప్రాజెక్టులైన జీకేఎల్‌ఐ, పీబీసీ, మైలవరం ద్వారా కేవలం 44,500 ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉండేది. మైలవరం ప్రాజెక్టును కూడా ఎప్పుడూ పూర్తిస్థాయిలో నింపిన ఆనవాళ్లు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మైలవరాన్ని ఆరు టీఎంసీలు, గండికోట ప్రాజెక్టును 26.5 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నింపడం జరిగింది. గండికోట ప్రాజెక్టును అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేయడంతో ఆయకట్టు పెరిగేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. టీడీపీ హయంలో ఉన్న ఆయకట్టు కంటే మూడింతలు పెరిగింది. 1.50 లక్షల ఎకరాలకు ఈ అనుబంధ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించేందుకు మార్గం సుగమమైంది.

జీకేఎల్ఐ ద్వారా 30 వేల ఎకరాలకు నీరు

గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ (జీకేఎల్ఐ) కింద 47,500 ఎకరాల ఆయకట్టు కాగా, 30 వేల ఎకరాలకు ఆయకట్టు నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 85 కిలోమీటర్ల మేర పిల్ల కాలువలు తవ్వడంతో ఆయకట్టుకు నీళ్లందించేందుకు మార్గం ఏర్పడింది. పైడిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 15 చెరువులను నింపి భూగర్భ జలాలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో 2019 వరకు కేవలం 7500 ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉండేది. నిర్మాణాత్మక పనులు చేపట్టకుండా విస్మరించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా..

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా 30 వేల ఎకరాల ఆయకట్టు అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిస్ట్రిబ్యూటరీ ద్వారా 15 వేల ఎకరాలకు, వివిధ లిఫ్టుల ద్వారా 15 వేల ఎకరాలకు మొత్తం 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టు కింద 59,400 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఇందులో 30 వేల ఎకరాలకు సాగునీటిని ప్రభుత్వం అందించేందుకు కృషి చేసింది. అంతేకాకుండా కొండ ప్రాంతాల్లో ఉన్న మురారిచింతల, దిగువపల్లె, ఎర్రబల్లి, వెలిదండ్ల, కోమన్నూతల తదితర ప్రాంతాల్లోని భూములకు 14 లిఫ్టుల ద్వారా సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే 15 గ్రామాలకు తాగునీరు అందించేందుకు అవకాశం ఏర్పడింది. భూగర్భజలాలు పెరగడం వల్ల బోరు బావుల్లో నీటిమట్టం మరింత పెరిగేందుకు దోహదపడింది. 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 7000 ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కాలువల మరమ్మత్తులు, డిస్ట్రిబ్యూటరీ పనులు, అసంపూర్తిగా ఉన్న లిఫ్ట్ పనులను పూర్తి చేయడంతో ఆయకట్టు అభివృద్ధికి అవకాశం ఏర్పడింది. 2020 నవంబరులో 10 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును నింపిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కింది. డిస్ట్రిబ్యూటరీలకు రూ. 15 కోట్లు, డీప్ వాల్‌కు రూ. 25 కోట్లు, లిఫ్టుల నిర్మాణానికి రూ. 10 కోట్లు కలిపి మొత్తం రూ. 50 కోట్ల నిధులు కేటాయించి పనులు చేపట్టడంతో ఆయకట్టు పెరిగేందుకు వీలు కలిగింది.

మైలవరం కింద 75 వేల ఎకరాలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మైలవరం ప్రాజెక్టు కింద ఆయకట్టు భారీగా పెరిగిందనడంలో సందేహం లేదు. టీడీపీ ప్రభుత్వంలో 2019 వరకు కేవలం ఈ ప్రాజెక్టు కింద 15 వేల ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉండగా, ఈ ప్రభుత్వ హయాంలో ఈ సంఖ్య 75 వేల ఎకరాలకు చేరింది. కమలాపురం, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు తదితర నియోజకవర్గాలకు సాగు, తాగునీటిని అందించేందుకు ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంతేకాకుండా నొస్సం బ్రాంచ్ కెనాల్ నుంచి టంగుటూరు బ్రాంచ్ కెనాల్, వెలువలి, గోపవరం సౌత్ కెనాల్, నార్త్ కెనాల్‌కు సంబంధించి పూడికతీత పనులు చేపట్టారు. మైలవరం నుంచి కేసీ కెనాల్ ద్వారా ఆదినిమ్మాయపల్లె ఆనకట్టకు 250 క్యూసెక్కుల నీటిని ఖరీఫ్‌లో 12 వేల ఎకరాలు ఎండిపోకుండా కాపాడారు. వెలవలి కెనాల్ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని తరలించి 5000 ఎకరాల ఆయకట్టు ఎండిపోకుండా అధికారులు చర్యలు చేపట్టి దాదాపు మూడు నెలలపాటు నీళ్లిచ్చిన పరిస్థితి ఉంది.

- గండికోట అనుబంధ ప్రాజెక్టులకు సంబంధించి ఆయకట్టు బాగా పెరిగింది. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అనుబంధ ప్రాజెక్టులుగా ఉన్న సీబీఆర్, పీబీసీ, సీకేఎల్ఐ, మైలవరం నుంచి సాగు, తాగు నీటికి ఇబ్బందులు లేవు.

విస్మరించిన టీడీపీ ప్రభుత్వం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన ప్రభుత్వ హయాంలో జలయజ్ఞం అనే పేరుతో జిల్లాలో ఉన్న ప్రాజెక్టుల అభివృద్ధి పనులను పరుగులు పెట్టించారు. ప్రత్యేక దృష్టి సారించి రైతులకు ప్రయోజనకరంగా పనులను చేపట్టారు. ఆయన మరణానంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం, ఇతర ప్రభుత్వాలుగానీ ప్రాజెక్టు అభివృద్ధి పనులను గాలికి వదిలేశారు. 2019లో అధికార పగ్గాలు చేపట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తండ్రిబాటలో నడుస్తూ పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు శ్రద్ధ వహించారు. దీంతో గండికోట అనుబంధ ప్రాజెక్టులుగా ఉన్న మైలవరం, సీబీఆర్, జీకేఎల్ఐ, పీబీసీ వంటి వాటి కింద ఆయకట్టు భారీగా పెరిగింది.

వివాదాస్పద పోస్టులకు అడ్మిన్‌దే బాధ్యత

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల ప్రకటనతో ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు ఏవైనా వస్తే అందుకు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఈసీఐ నిబంధనలు పేర్కొంటున్నాయి. గ్రూపుల్లో ప్రతి పోస్టుకు అడ్మిన్‌దే బాధ్యత. ప్రతి పోస్టును అడ్మిన్ పరిశీలించుకోవాలని, వివాదాస్పద పోస్టులు, కామెంట్స్‌ను డిలిట్ చేయాలి. వివాదాస్పద పోస్టులు పెట్టే సభ్యులను గ్రూపుల నుంచి తొలగించాలి. ఈ తరహా పోస్టులను పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అడ్మిన్ వివాదాస్పద పోస్టులపై చర్యలు తీసుకోకపోతే అడ్మిన్ కూడా నేరస్తుడే అవుతాడు. వివాదాస్పద పోస్టులు పెడితే ఐపీసీ సెక్షన్ 153 ఏ ప్రకారం ఐదేళ్ల వరకు జైలు శిక్షకు అర్హులవుతారు.

షేర్ చేయకూడని అంశాలు..

- విద్వేషాలు రెచ్చగొట్టేవి. • వర్గపోరుకు దారి తీసే అంశాలు • దేశభద్రతకు ముప్పు కలిగించే సందేశాలు, అంశాలు. • ఫేక్ న్యూస్ • మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలు • వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు • పోర్న్‌క్లిప్స్, వీడియోలు.

అక్రమ మద్యం నివారణకు కంట్రోల్ రూం ఏర్పాటు



మాట్లాడుతున్న గోపాల్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాలో అక్రమ మద్యం నివారణకు కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ పేర్కొన్నారు. శనివారం కడపలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సిబ్బంది ఎవరైనా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేసినా..పరిమితికి మించి మద్యం బాటిళ్లను ఇచ్చినా కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు మద్యం అమ్మితే సిబ్బందిపై కేసులు నమోదు చేసి విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శుల నియామకం





పేట నాగరాజు, మహబూబ్ అలీకి నియామక పత్రం అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ కె. సురేష్ బాబు,

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులుగా 22వ డివిజన్‌కు చెందిన పేట నాగరాజు, మహబూబ్ అలీని నియమించినట్లు వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, పార్టీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్ బాషా తెలిపారు. శనివారం వారిరువురికీ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. అనంతరం నాగరాజు, మహబూబ్ అలీ మాట్లాడుతూ తమకు పదవులు ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌కు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రయ్య, దేవిరెడ్డి ఆదిత్య, ఎస్. సుబ్బారెడ్డి, రాణాప్రతాప్,సీహెచ్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



హరికి నియామకపత్రం అందజేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, ఎస్‌వీ సతీష్‌కుమార్‌రెడ్డి

పులివెందుల టౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీగా తోటంశెట్టి హరికృష్ణ రాయల్ నియమితులయ్యారు. శనివారం నియామక పత్రాన్ని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్‌వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర రెడ్డి, మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ చిన్నప్పలు అందజేశారు. జిల్లా మైనార్టీ జనరల్ సెక్రటరీగా పులివెందులకు చెందిన మహమ్మద్ బాషాను నియమించారు. తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలకు హరికృష్ణరాయల్ కృతజ్ఞతలు తెలిపారు. జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లి కిశోర్, చంద్రమౌళి, నూరుభాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్, జిల్లా ప్రధాన కార్యదర్శి డేనియల్‌బాబు, కోఆప్షన్ మెంబర్ డి.చంద్రమౌళి, కౌన్సిలర్లు ఖాదర్, రంగనాయకులు, ఎస్.వీరా, దూదేకుల సంఘ అధ్యక్షులు ఫకృద్దీన్, సిద్దయ్య, సంపత్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట నియంత్రణ

- కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్
- ఫిర్యాదులకు 08562–315672
- ప్రత్యేక పర్యవేక్షణాధికారిగా మున్సిపల్ కమిషనర్



కలెక్టరేట్‌లో ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్

కడప సెవెన్‌రోడ్స్: పార్లమెంట్, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించడం కోసం కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేశారు. షెడ్యూల్ వెలువడిన వెంటనే జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కంట్రోల్ రూం ఏర్పాటైంది. ఎన్నికలకు సంబంధించిన కార్యకలాపాల పర్యవేక్షణ పకడ్బందీగా నిర్వహించడం దీని ఉద్దేశం. ప్రత్యేక పర్యవేక్షణాధికారిగా కడప మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్‌ను నియమించారు. మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా, సోషల్ మీడియా సెల్), 24×7 కాల్ సెంటర్, కంప్లైంట్ మానిటరింగ్ సెల్, రిపోర్టు మేనేజ్‌మెంట్, డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ అండ్ కంప్లైంట్స్ రెడ్రెసల్ సెల్, పర్మిషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర అంశాలకు సంబంధించిన విభాగాలను ఏర్పాటు చేశారు.

ఎంసీసీ విభాగం

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ పాటిస్తున్నారా? లేదా? అనే అంశంపై ఎంసీసీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఎవరైనా అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం, పర్మిషన్ లేకుండా ఎన్నికల ప్రచారానికి వాహనాలను ఉపయోగించడం, మసీదులు, చర్చిలు, దేవాలయాలు, విద్యా సంస్థల్లో ఎన్నికల ప్రచా రం చేయడం వంటి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించి వాటిని జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి ఈ విభాగం తీసుకెళుతుంది.

ఎన్‌జీఆర్ఎస్/ఎన్‌జీఎస్‌పీ

జిల్లా ఎలక్షన్ కంట్రోల్ రూములో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ అండ్ కంప్లైంట్స్ రెడ్రెసల్ సెల్ విభాగంలో ఎన్‌జీఆర్ఎస్, ఎన్‌జీఎస్‌పీ, సీ–విజిల్, కంప్లైంట్ రిసెప్షన్ యూనిట్, కాల్ సెంటర్ –1950 ద్వారా వచ్చే అన్ని రకాల ఫిర్యాదులను స్వీకరిస్తారు.

ఎంసీఎంసీ: మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో ప్రచురితమైన, టెలికాస్ట్ అయిన, అడ్వర్స్ అయిన వార్తలను పరిశీలించి ఈ విభాగం నివేదికలు పంపుతుంది. కంట్రోల్ రూము నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ కూడా కొనసాగుతోంది. వెబ్ కాస్టింగ్, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల విధులను కూడా పర్యవేక్షిస్తారు. అలాగే రాజకీయ నాయకులు, అభ్యర్థులు ఉపయోగించే వాహనాల అనుమతులకు సంబంధించిన రిపోర్టుల పరిశీలన, రూట్ మ్యాప్ పర్యవేక్షణ నిర్వహిస్తారు. నోడల్ అధికారుల సమాచారం, ఎన్నికల సంబంధిత కార్యక్రమాలపై సమాచార పౌరసంబంధాలశాఖ ఎన్నికల మీడియా సెంటర్ నుంచి సమాచారాన్ని అందిస్తారు.

సువిధ పోర్టల్

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహించే ప్రచారాలు, ఊరేగింపులు, అనౌన్స్‌మెంట్స్, మైక్ సిస్టమ్, ఇతర ప్రచారాలు, హెలిప్యాడ్ ఏర్పాటు తదితర 24 రకాల అంశాలకు సంబంధించిన అనుమతులను ఈ పోర్టల్ ద్వారా పొందవచ్చు. సువిధ ద్వారా అందిన వినతులను సంబంధిత లైజన్ డిపార్టుమెంట్లకు పంపుతారు. సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు జారీ చేస్తారు. తమ దరఖాస్తుల స్టేటస్ కూడా తెలుసుకునే వీలుంటుంది.

ల్యాండ్‌లైన్

ఎప్పటికప్పుడు సమాచార సేవల కోసం 08562 –315672 అనే కాల్ సెంటర్ నంబరును ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎవరైనా ఈ నంబరుకు ఫోన్ చేసి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయడంతో పాటు ఎన్నికల సమాచార సేవలను పొందవచ్చు. నేషనల్ గ్రీవెన్స్ సర్వీసు పోర్టల్ , సీ–విజిల్ యాప్, ఓటరు హెల్ప్‌లైన్ నంబరు 1950 (టోల్‌ఫ్రీ)సమాచార ఫిర్యాదుల కోసం ఈ మాధ్యమాలను ఏర్పాటు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

– రూ,10 లక్షల ఆస్తి నష్టం



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన సామగ్రి

చింతకొమ్మదిన్నె : మండలంలోని గూడవాండ్లపల్లి గ్రామంలో శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శ్రావణి అనే మహిళ ఇల్లు దగ్ధమైంది. అగ్నిమాపక అధికారి బసివి రెడ్డి తెలిపిన సమాచారం మేరకు శ్రావణి కుటుంబ సభ్యులు ఇంటి టెర్రస్‌పై నిద్రిస్తున్న సమయంలో తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ అయింది. తొలుత సోఫాలు దగ్ధమయ్యాయి. ఆ తర్వాత ఆ మంటలు ఇళ్లంతా వ్యాపించడంతో పొగ అలుముకుంది. దీంతో నిద్రిస్తున్న శ్రావణి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా లేచి చూసి కేకలు వేశారు. చుట్టుపక్కల ఉన్న ప్రజలు మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తూనే ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. వెంటనే వారు సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో బాధితురాలికి సంబంధించి రూ.3.20 లక్షలు నగదు, దాదాపు పది లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.

రాజంపేటలో రాజుకున్న అసంతృప్తి

- టీడీపీ టికెట్ సుగవాసికి ఇవ్వడంపై బత్యాల వర్గీయుల ఆగ్రహం
- బత్యాలను ఇండిపెండెంట్‌గా పోటీ చేయించే యోచన
- రేపు బలప్రదర్శనకు సిద్ధమవుతున్న వైనం



బత్యాల చెంగల్రాయుడు

రాజంపేట : రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని ఐదేళ్లుగా కాపాడుకుంటూ, పార్టీ క్యాడర్‌కు వెన్నుదన్నుగా నిలిచిన టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడుకు అధినేత చంద్రబాబునాయుడు టికెట్ విషయంలో మొండిచెయ్యి చూపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో బత్యాల వర్గీయులు, పార్టీ సీనియర్లు, కార్యకర్తలు, బలిజ సామాజికవర్గ నేతలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. ఇప్పుడు తిరుగుబాటు చేయకపోతే రాజంపేట టీడీపీకి అభ్యర్థుల దిగుమతి సంస్కృతి కొనసాగుతూనే ఉంటుందని తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యాడర్ నిర్ణయంపై బత్యాల ఆధారపడి ఉన్నారు.

ఇండిపెండెంట్‌గా బత్యాల?

రాయచోటికి చెందిన మాజీ జెడ్పీటీసీ సుగవాసి బాలసుబ్రమణ్యంను రాజంపేటలో పోటీ చేయించాలనే చంద్రబాబు నిర్ణయంపై బత్యాల వర్గీయులు నిరసన స్వరం వినిపిస్తున్నారు. బత్యాలకు టికెట్ ఇచ్చే వరకు అధిష్టానాన్ని వదిలేది లేదంటూ హెచ్చరిస్తున్నారు. అధిష్టానానికి తమ తడాఖా ఏమిటో చూపిస్తామంటూ టీడీపీ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా అయినా బత్యాల పోటీ చేయాల్సిందేనని శనివారం జరిగిన పార్టీ మీటింగ్‌లో ఇండిపెండెంట్ అంశాన్ని తమ్ముళ్లు లేవనెత్తారు. ఈ అవకాశం పోతే ఇక బత్యాలకు అవకాశమే రాదని బలంగా విశ్వసిస్తున్నారు. టీడీపీ టికెట్‌ను చంద్రబాబు రాయచోటి నేతలకు అమ్ముకున్నారని ఆ పార్టీ నేతలే బాహాటంగా విమర్శిస్తున్నారు.

బలప్రదర్శనకు సిద్ధమవుతున్న తమ్ముళ్లు..

రాయచోటి నేత సుగవాసి వద్దు.. బత్యాల ముద్దు అనే నినాదాన్ని పార్టీ క్యాడర్‌లో బలంగా తీసుకెళ్లేందుకు టీడీపీ వర్గీయులు సమాయత్తమవుతున్నారు. ఏప్రిల్ 1న ఉదయం 9గంటలకు నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో బత్యాలకు మద్దతుగా టీడీపీ క్యాడర్ ర్యాలీ చేపట్టనుంది. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని బత్యాల బల ప్రదర్శనకు సన్నాహాలు జరుగుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



వేముల : మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పులివెందులకు చెందిన ముగ్గురు వ్యక్తులు సొంత పని నిమిత్తం స్కార్పియోలో కడపకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి పులివెందులకు వస్తుండగా ఇ.కొత్తపల్లె సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో స్కార్పియో వాహనం పల్టీ కొడుతూ అవతలి రోడ్డువైపు నుంచి జొన్న చేనులోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు స్వల్పగాయాలు కావడంతో 108 ద్వారా చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

పిల్లల చదువులకు ఇబ్బందులు తప్పాయి



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల్లో భాగంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకంతో మా పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా పోయింది. అంతే కాకుండా అనేక సంక్షేమ పథకాలతో మా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. పేదరికంతో బాధపడుతున్న మాకు గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు వర్తించక చాలా ఇబ్బందులు పడ్డాం. మా కుమార్తె స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటోంది. అమ్మ ఒడి పథకం వర్తించింది. అలాగే నా పేరుతో ఇంటి స్థలంతో పాటు పక్కాగృహం మంజూరైంది. ప్రస్తుతం ఇంటి నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇంతకంటే మేలు చేసే ప్రభుత్వం మరొకటి లేదు.

– కటిక కృష్ణవేణి, చాకలి వీధి, వేంపల్లె

సొంతింటికల నెరవేర్చిన సీఎం



నాకు వివాహమై దాదాపు 15 సంవత్సరాలు అయింది. ప్రభుత్వం నాకు ఇల్లు కానీ, ఇంటి స్థలం కానీ మంజూరు చేయలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి, అందులోనే హౌసింగ్ తరపున ఇంటిని కూడా మంజూరు చేయించారు. నాకు ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సొంత ఇంటి కలను నెరవేర్చిన సీఎం జగన్ మోహన్ రెడ్డి మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని నేను కోరుకుంటున్నాను.

– గంగనపల్లి సావిత్రి, ఒంటిమిట్ట

ఇంటి వద్దకే ధ్రువపత్రాలు



గతంలో మా పిల్లల కోసం ధ్రువపత్రాలు పొందాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకుని అనంతరం పత్రాలు చేతికందాలంటే మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో మాకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం గ్రామ వలంటీర్‌కు తెలిపాము. ఒక్కరోజులోనే ఇంటి వద్దకు సర్టిఫికెట్లు తెచ్చి ఇచ్చారు. ప్రభుత్వ పాలన ఇంత సులభతరం చేసిన సీఎంకి రుణపడి ఉంటాం.

– ఎం. వెంకటమల్లమ్మ, వేపులబైలు

క్యాన్సర్‌పై ఉచిత అవగాహన

రాజంపేట టౌన్ : ప్రస్తుతం మారిన ఆహారపు అలవాట్ల వల్ల అనేక మంది క్యాన్సర్ వ్యాధి బారినపడుతున్నారని, సరైన సమయంలో గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చని కడపకు చెందిన క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ గుండ్రాతి వంశీవిహారి తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 7989596929 నంబర్‌కు ఫోన్ చేసి క్యాన్సర్‌కు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు చికిత్సకు సంబంధించిన సలహాలను కూడా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల గెలుపునకు కృషిచేస్తాం



వైఎస్సార్‌సీపీలో చేరిన తమ్మినేని కుటుంబాలతో వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ తరపున కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని మాజీ కౌన్సిలర్ తమ్మినేని లక్ష్మీదేవి అన్నారు. శనివారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవగుడి వర్గానికి చెందిన మాజీ కౌన్సిలర్ తమ్మినేని లక్ష్మీదేవి, తమ్మినేని శ్రీను, తమ్మినేని వెంకటేశ్‌తో పాటు మరో 50 కుటుంబాల వారిని ఎంపీ, ఎమ్మెల్యేలు పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసలాజం, కౌన్సిలర్ గౌరీనాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో 30 కుటుంబాలు చేరిక

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డిల సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పడిగపాటి వెంకటశివారెడ్డితో పాటు 30 కుటుంబాల వారు ఉన్నారు.

ఎర్రగుంట్ల పట్టణంలో ఉన్న సుమారు 40 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారిలో యాసిన్, ఆజమ్, ఆరిఫ్, నిరంజన్, దినకర్, ఉరిఫ్, కుమార్, మల్లి తదితరులు ఉన్నారు. వీరంతా అనుభాయ్‌గారి గఫూర్, బీఎస్ మాబువలి, ఏఎస్ మస్తాన్, ఎస్ షరీఫ్‌ల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

దువ్వూరు : దువ్వూరు ఎస్సీ కాలనీలో శనివారం జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కానాల ఓబుళరెడ్డి, సర్పంచ్ చెంద్రాయుడు ఆధ్వర్యంలో వంద కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శెట్టిపల్లె నాగిరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జేష్టాది ప్రభాకర్, చిటికెల కిరణ్‌కుమార్, మణి బ్రదర్స్, జక్కల బ్రదర్స్, పెన్నకంటి సోమయ్య, ఎర్రమల్లె పాములేటి, ముంతా సుధాకర్, జేష్టాది సుశీలమ్మ తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



అదుపుతప్పి బోల్తాపడిన ట్రాక్టర్



ప్రమాదంలో మృతిచెందిన జయరామిరెడ్డి

లింగాల : లింగాల మండలం మురారిచింతల గ్రామ సమీపంలో ఈతాకు లోడుతో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లోడుపై కూర్చున్న దిగువపల్లె గ్రామానికి చెందిన జయరామిరెడ్డి(60) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ బీవీ కృష్ణయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం ముదిగుబ్బ ప్రాంతం నుంచి మండలంలోని ఎగువపల్లె గ్రామానికి ఈతాకు తీసుకుని వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఎండలు ఎక్కువగా ఉన్నందున అరటి మొక్కలకు నీడ ఉండేందుకు ఈతాకులను నీడగా కప్పుతారు. అరటి మొక్కలను రక్షించేందుకు ఇవి ఉపయోగపడతాయి. వాటిని ముదిగుబ్బ ప్రాంతంలో జయరామిరెడ్డి కొనుగోలు చేసి ఎగువపల్లె గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను తీసుకుని వెళ్లి లోడ్ చేసుకుని వస్తుండగా అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఈతాకు కింద కూరుకుపోయి జయరామిరెడ్డి ఊపిరి ఆడక మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబు

- టిప్పర్ డ్రైవర్‌ను అసెంబ్లీకి పంపాలనుకోవడం జగన్ తప్పా.!
- డ్రైవర్లను అవమానించడం దారుణం
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్
- అంబేడ్కర్ విగ్రహం ఎదుట నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు దళిత ద్రోహి అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు నాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ కూడలిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిప్పర్ డ్రైవర్‌ను అసెంబ్లీకి పంపాలనుకోవడం సీఎం వైఎస్ జగన్ తప్పా అని ప్రశ్నించారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ప్రతి ఒక్కరూ సమానమేనని, అందరికీ సమాన హక్కులు, అవకాశాలు ఉండాలన్నారు. పొట్టకూటి కోసం డ్రైవర్ వృత్తిని చేపడితే టిప్పర్ డ్రైవర్‌కు టిక్కెట్టు ఇచ్చారు అంటూ అవహేళన చేయడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. ఆర్థికంగా ఎంఎల్ఏగా పోటీ చేసే స్థాయి లేకపోయినా.. వీరాంజనేయులులో ప్రజాసేవ పట్ల ఉన్న అంకితభావాన్ని గుర్తించి వైఎస్ జగన్ పిలిచి టిక్కెట్టు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. పేదలు, దళితులంటే చంద్రబాబుకు మొదటి నుంచి చాలా అలుసని, తరచూ తమను హేళన చేస్తూ మాట్లాడడం ఆయనకు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తికి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు నారపురెడ్డి సుబ్బారెడ్డి, పి. జయచంద్రారెడ్డి, పార్టీ నాయకులు బండి ప్రసాద్, జాషువా, డాక్టర్ శివానాయక్, వేణుగోపాల్ నాయక్, కె. బాబు, త్యాగరాజు, ఇలియాస్, పవర్ అల్తాఫ్, కంచుపాటి బాబు, లక్ష్మీనారాయణ, చైతల్య, విజయ కుమారి, తులశమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

వేంపల్లె : ఈ నెల 24న రాత్రి స్థానిక గండిరోడ్డులోని శ్రీసాయి రజిత పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన యువకుడి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇరువర్గాలు కత్తులతో దాడిచేసుకున్న సంఘటనలో నరసింహులు (18) అనే యువకుడు 26వతేదీ తెల్లవారుజామున కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ హత్యకు సంబంధించి నిందితుడు తమ్మిశెట్టి నాగేంద్రను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. వివరాల్లోకి వెళ్తే స్థానిక శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన గోగుల శ్రీనివాసులు, గోగుల నరసింహులు, వల్లెపు శివలు మద్యం తాగి ఉండగా అదే ప్రాంతానికి చెందిన తమ్మిశెట్టి నాగేంద్ర వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని వీరు అవమాన పరిచారు. ఆ తర్వాత మాటామాటా పెరిగి కత్తులతో దాడి చేసుకున్నారు. నాగేంద్ర ముగ్గురిలో ఒకరినైనా చంపితేగానీ తన గురించి నలుగురిలో మాట్లాడకుండా ఉంటారనే ఉద్దేశంతో పిడిబాకుతో మొదట శ్రీనివాసులు కడుపులో పొడిచినట్లు తెలిపారు. అంతలో గోగుల నరసింహులు, వల్లెపు శివలు అడ్డుపడగా వారిని కూడా పిడిబాకుతో పొడవడంతో కత్తిపోట్లకు గురయ్యారు. అదే పిడిబాకుతో నాగేంద్రను కూడా వీరు తొడలో పొడిచి గాయపరిచారు. స్థానికులు గమనించి రక్తగాయాలతో ఉన్న నలుగురిని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ 26వ తేదీ తెల్లవారుజామున గోగుల నరసింహులు మృతిచెందాడు. అయితే నిందితుడు నాగేంద్ర చికిత్స అనంతరం ఇంటికి రావడంతో అతనిపై హత్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 5లక్షలు నగదు పట్టివేత

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో జరిగిన వాహన తనిఖీల్లో రూ.5లక్షలు నగదు పట్టుకున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం లీడర్ సరస్వతి తెలిపారు. శనివారం కమలాపురం పట్టణ పరిధిలోని ఎస్సార్ పెట్రోల్ బంక్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా అనంతపురం నుంచి తిరుపతికి వెళ్తున్న హోండా కారును తనిఖీ చేయగా అందులో ప్రయాణిస్తున్న ఈ.వెంకట శేషారెడ్డి అనే వ్యక్తి వద్ద రూ.5లక్షలు నగదు ఉండటంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఒక వ్యక్తి రూ.50వేల కంటే ఎక్కువగా నగదు తీసుకెళ్లకూడదు. ఈ నిబంధన మేరకు ఆ వ్యక్తి వద్ద రూ.5లక్షలు ఉండటంతో ఆ నగదును స్వాధీనం చేసుకుని డీటీఓ కార్యాలయంలో జమ చేశామన్నారు. తగిన రసీదులతో వస్తే వారికి నగదు తిరిగి ఇస్తామని ఆమె తెలిపారు.

కడపలో రూ. 2లక్షలు నగదు స్వాధీనం

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీఎస్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కృష్ణకిషోర్ అనే ఉపాధ్యాయుడు రూ. 2లక్షలు తీసుకుని వెళుతుండగా పట్టుకున్నారు. తదుపరి చర్యల కోసం కడప ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లారు.

- కడపలో 50 క్వార్టర్స్ మద్యం స్వాధీనం

కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రైతు బజార్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో 50 క్వార్టర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పరారయ్యాడు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



మృతి చెందిన రామసుబ్బమ్మ

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండల పరిధిలోని గొరిగెనూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీరుకట్టు రామసుబ్బమ్మ (50) అనే వివాహిత మహిళ విద్యుత్ షాక్‌కు గురై శనివారం రాత్రి మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. గొరిగెనూరు గ్రామానికి చెందిన నీరుకట్టు రామసుబ్బమ్మ భర్త బాలు హమాలీ పనిచేసి జీవనం సాగించేవాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. రామసుబ్బమ్మ గ్రామంలో కూలి పనులు చేసుకునేది. శనివారం సాయంత్రం వ్యాపారం సుబ్బారాయుడు అనే వ్యక్తి ఇంట్లో బండలు తుడుస్తుండగా ఒక చేతితో తడిగుడ్డ మరో చేతితో అడ్డంగా ఉన్న కరెంట్ ఫ్లక్స్‌బాక్స్‌ను పట్టుకుంది. అయితే ఫ్లక్స్ బాక్సు వైరు దెబ్బతిని ఉండటంతో షాక్‌కు గురైంది. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది.